




## బిగ్‌బాస్ చాలా కష్టం

తెలుగు ప్రముఖ యాంకర్, నటి విష్ణు ప్రియ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. ఈమె కొంతకాలం క్రితం తెలుగు బిగ్ బాస్‌లో పాల్గొన్న విషయం తెలిసిందే. తాజాగా ఈ నటి అల్లరి నరేష్ ప్రధాన పాత్రలో రూపొందిన 'రంభ ఊర్వశి మేనక' చిత్రంలో కీలక పాత్రలో నటించింది. ఈ సినిమాను సెప్టెంబర్ 4న విడుదల చేయనున్నారు. ఈ నేపథ్యంలో విష్ణు ప్రియ పెద్ద ఎత్తున ప్రమోషన్లలో పాల్గొంటోంది. తాజాగా బిగ్ బాస్ కార్యక్రమం గురించి, ప్రస్తుతం సామాన్యులను హౌస్‌లోకి తీసుకువెళ్లేందుకు నిర్వహిస్తున్న 'అగ్నిపరీక్ష'కు సంబంధించి విలేకరులు విష్ణు ప్రియను కొన్ని ప్రశ్నలు అడిగారు.

దీనికి ఆమె స్పందిస్తూ.. "ప్రస్తుతం బిగ్ బాస్‌లోకి సామాన్యులను తీసుకురావడానికి అగ్నిపరీక్ష నిర్వహిస్తున్నారు. నేను బిగ్ బాస్‌లోకి వెళ్లినప్పుడు సామాన్యులను తీసుకురావడానికి అగ్నిపరీక్ష లాంటి కార్యక్రమాలు ఏవీ లేవు. అయినా కూడా నాకు బిగ్ బాస్ చాలా కష్టంగా అనిపించింది. ఏదో దేవుడి దయ వల్ల అలా సాగిపోయింది. ఆ షో నాకు అత్యంత కష్టమైన పనిగా అనిపించింది" అని విష్ణు ప్రియ చెప్పుకొచ్చింది. ఇక వచ్చే నెల సెప్టెంబర్ 6 నుంచి బిగ్ బాస్ తెలుగు సీజన్ 10 ప్రారంభం కాబోతున్నట్లు తెలుస్తోంది. ఈ సీజన్‌లో పెద్ద సంఖ్యలో సామాన్యులు ఎంట్రీ ఇవ్వనున్నట్లు సమాచారం. ఇప్పటివరకు అద్భుతమైన రీతిలో ప్రేక్షకులను అలరించిన బిగ్ బాస్ కార్యక్రమం పదో సీజన్ ఏ స్థాయిలో అలరిస్తుందో చూడాలి.




## సుదీప్ బర్త్‌డేకి బిగ్ సర్‌ప్రైజ్!

కన్నడ సూపర్ స్టార్ కిచ్చా సుదీప్ హీరోగా రాబోతున్న 'బిల్లా రంగ బాషా' అనేది క్రీస్తు శకం 2209 నాటి ఒక ఫ్యూచరిస్టిక్ డిస్టోపియన్ ప్రపంచం నేపథ్యంలో సాగే భారీ సైన్స్ ఫిక్షన్ యాక్షన్-అడ్వెంచర్ మూవీ. 'విక్రాంత్ రోణా' దర్శకుడు అనుప్ భండారి తెరకెక్కిస్తున్న ఈ సినిమా హిమాలయాల షెడ్యూల్‌ను పూర్తి చేసుకుని, ప్రస్తుతం భారీగా నిర్మించిన 'ద్వారక' సెట్‌లో షూటింగ్‌ను జరుపుకుంటోంది. 'హనుమాన్' చిత్ర నిర్మాతలు ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై కె. నిరంజన్ రెడ్డి దాదాపు 75 కోట్ల భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ సినిమాలో సుదీప్ మూడు విభిన్న షేడ్స్ ఉన్న పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. ఈ రోజు చిత్ర బృందం ఈ సినిమాకు సంబంధించిన ఒక క్రేజీ ప్రమోషనల్ క్యాలెండర్‌ను కూడా లాక్ చేసింది. కిచ్చా సుదీప్ పుట్టినరోజు సందర్భంగా 2026సెప్టెంబర్ 2న ఒక గ్రాండ్ స్పెషల్ పోస్టర్‌ను, అలాగే 2027 ప్రారంభంలో టీజర్‌ను విడుదల చేయనున్నారు. అన్ని హంగులతో సిద్ధమవుతున్న ఈ ప్రతిష్టాత్మక పాన్-ఇండియా మూవీని 2027 చివరి త్రైమాసికంలో (అక్టోబర్ లేదా డిసెంబర్ 2027) ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై కె. నిరంజన్ రెడ్డి ఎందులోనూ రాజీ పడకుండా సినిమాను రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. సుదీప్ స్టార్‌డమ్‌కు తగ్గట్టుగా భారీ స్కేల్‌లో తెరకెక్కుతున్న ఈ ప్రాజెక్ట్‌పై కన్నడతో పాటు ఇతర భాషల ప్రేక్షకుల్లోనూ ఆసక్తి నెలకొంది. మొత్తంగా చూస్తే 'బిల్లా రంగ బాషా' విషయంలో మేకర్స్ సినిమా విడుదల తేదీ కంటే ముందే ప్రమోషనల్ క్యాలెండర్‌ను ప్రకటించడం ప్రత్యేకంగా నిలిచింది. 2026 సెప్టెంబర్ 2న సుదీప్ పుట్టినరోజు పోస్టర్‌తో మొదలయ్యే ఈ ప్రయాణం, 2027 తొలి త్రైమాసికంలో ట్రైలర్, పాటలు, చివరికి 2027 చివరలో సినిమా రిలీజ్ తో ముగియనుంది. మరి ఇంత భారీ ప్లానింగ్‌తో వస్తున్న ఈ మూవీ సుదీప్ కెరీర్‌లో ఎలాంటి ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంటుందో చూడాలి.

## ఆ డైరెక్టర్ తో తాప్సీ మూవీ




టాలెంటెడ్ డైరెక్టర్ మేర్లపాక గాంధీ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. ఇప్పటికే పలు చిత్రాలకు దర్శకత్వం వహించి మంచి గుర్తింపును సంపాదించుకున్నారు. తాజాగా ఈ దర్శకుడు వరుణ్ తేజ్ హీరోగా 'కొరియన్ కనకరాజు' చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. మేర్లపాక గాంధీ ఇప్పటికే తన తదుపరి సినిమాకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఆయన తన నెక్స్ట్ మూవీని తాప్సీతో చేయబోతున్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ విషయమై దర్శకుడు తాప్సీని సంప్రదించి ఓ కథను వినిపించగా, ఆమె కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ మూవీ హారర్ జానర్‌లో తెరకెక్కబోతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు కామెడీ చిత్రాలతో ప్రేక్షకులను అలరించిన మేర్లపాక గాంధీ తొలిసారి హారర్ సినిమా చేయబోతున్నారనే వార్తలు రావడంతో ఈ మూవీపై ఇండస్ట్రీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

## చిన్న సినిమా.. భారీ కలెక్షన్లు

సినిమా హిట్ అయితే సాధారణంగా బాక్సాఫీస్ కలెక్షన్లు, రికార్డులు, లాభాలు మాత్రమే గుర్తుకొస్తాయి. కానీ ఒక సినిమా సాధించిన విజయాన్ని సమాజానికి తిరిగి అందించాలనే ఆలోచనతో ముందుకు సాగితే, ఆ విజయం మరింత ప్రత్యేకంగా మారుతుంది. ప్రస్తుతం మరాఠీ చిత్రం 'దేవూల్ బంద్ 2' విషయంలో ఇదే జరుగుతోంది. కేవలం 8 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఏకంగా రూ.100 కోట్ల మార్కును దాటింది. అంతేకాదు సినిమా నిర్మాణానికి అయిన ఖర్చును మాత్రమే ఉంచుకుని, మిగిలిన లాభాలను రైతు కుటుంబాలకు విరాళంగా ఇవ్వాలని మేకర్స్ నిర్ణయించుకున్నారు. అయితే ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రావడానికి ముందు బాలీవుడ్ స్టార్ షారుఖ్ ఖాన్ చేసిన సాయం కూడా ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. అసలు ఈ సినిమాకు షారుఖ్ ఎలా సహాయం చేశారు? రూ.100 కోట్ల విజయాన్ని సాధించిన తర్వాత నిర్మాతలు ఎందుకు లాభాలను విరాళంగా ఇవ్వాలని నిర్ణయించుకున్నారు? అనే వివరాల్లోకి వెళ్తే..

'దేవూల్ బంద్ 2'కు ప్రవీణ్ తార్డే దర్శకత్వం వహించారు. రైతు కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన తార్డే, తనకు దగ్గరైన అంశాలను కథలో ప్రతిబింబించినట్లు తెలుస్తోంది. ఈ సినిమా 2026 మేలో థియేటర్లలోకి వచ్చింది. మోహన్ జోషి, స్నేహల్ తార్డే, మహేష్ మంజ్రేకర్, ప్రసాద్ ఓక్ తదితరులు ఇందులో కీలక పాత్రలు పోషించారు.



Marathi film 'Deool Band 2'

విడుదలైన తర్వాత ప్రేక్షకుల నుంచి మంచి స్పందన రావడంతో సినిమా వసూళ్లు వేగంగా పెరిగాయి. చివరకు రూ.100 కోట్ల క్లబ్‌లోకి చేరి మరాఠీ చిత్ర పరిశ్రమలో ప్రత్యేక విజయాన్ని నమోదు చేసింది. అయితే 'దేవూల్ బంద్ 2' ప్రయాణంలో బాక్సాఫీస్ విజయానికి ముందే ఒక పెద్ద సమస్య ఎదురైంది. సినిమా రిలీజ్ కు సిద్ధమైనప్పటికీ, దాన్ని విస్తృతంగా థియేటర్లలో విడుదల చేయడానికి అవసరమైన డిజిటల్ సినిమా ప్యాకేజీ అంటే డీసీపీ కోసం అదనపు ఖర్చు అవసరమైంది. చిత్రబృందం మొదట సుమారు రూ.12 లక్షల వ్యయాన్ని అంచనా వేసినప్పటికీ, చివరికి ఈ ఖర్చు దాదాపు రూ.42 లక్షలకు చేరుతుందని తేలింది. పరిమిత బడ్జెట్‌తో రూపొందించిన ప్రాంతీయ చిత్రానికి ఈ మొత్తం భరించడం చాలా కష్టంగా మారింది.

ఈ సమయంలోనే షారుఖ్ ఖాన్ రంగంలోకి వచ్చారు. చిత్రబృందం ఆయనకు చెందిన రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్‌మెంట్‌ను సంప్రదించి తమ పరిస్థితిని వివరించింది. సినిమా మరాఠీ చిత్రమని, పరిమిత బడ్జెట్ కారణంగా డీసీపీ ఖర్చును భరించడం తమకు సాధ్యం కావడం లేదని నిర్మాతలు తెలిపారు. ఈ విషయం షారుఖ్ వరకు వెళ్లడంతో ఆయన తన బృందం నుంచి సినిమా గురించి వివరాలు తెలుసుకున్నారు. సినిమా గురించి తెలుసుకున్న తర్వాత షారుఖ్ ఖాన్ తీసుకున్న నిర్ణయం చిత్రబృందానికి ఎంతో ఊరటనిచ్చింది. వారికి సహాయం చేయాలని ఆయన తన బృందానికి సూచించినట్లు ప్రవీణ్ తార్డే తెలిపారు. ఈ ఒక్క నిర్ణయం వల్ల 'దేవూల్ బంద్ 2' రిలీజ్ అడ్డంకి తొలగిపోయింది. పెద్ద స్టార్ అయినప్పటికీ, ఒక చిన్న ప్రాంతీయ సినిమాకి అండగా నిలవడం సినీ వర్గాల్లో ప్రత్యేకంగా నిలిచింది.

ఇక సినిమా రూ.100 కోట్ల వసూళ్లు సాధించిన తర్వాత కూడా మేకర్స్ తీసుకున్న నిర్ణయం ఈ విజయాన్ని మరింత ప్రత్యేకంగా మార్చింది. సాధారణంగా భారీ వసూళ్లు వచ్చినప్పుడు నిర్మాతలు, పెట్టుబడిదారులు లాభాలను పంచుకుంటారు. కానీ 'దేవూల్ బంద్ 2' బృందం మాత్రం సినిమా నిర్మాణానికి అయిన అసలు ఖర్చును మాత్రమే ఉంచుకుని, మిగిలిన లాభాలను విరాళంగా ఇవ్వాలని నిర్ణయించింది. ముఖ్యంగా పేదరికం, అప్పుల భారంతో ఆత్మహత్యలకు పాల్పడిన రైతుల కుటుంబాలకు ఆ మొత్తాన్ని అందించాలని దర్శకుడు ప్రవీణ్ తార్డే, నిర్మాత కైలాష్ వాణి నిర్ణయించినట్లు సమాచారం. సినీ ఇండస్ట్రీలో ఒక ప్రాంతీయ చిత్రం ఇంతటి వసూళ్లు సాధించడం గొప్ప విషయమే. కానీ ఆ విజయాన్ని సమాజానికి ఉపయోగపడే విధంగా మలచడం మరింత అరుదైన విషయం. 'దేవూల్ బంద్ 2' ఇప్పుడు కేవలం రూ.100 కోట్ల మరాఠీ సినిమాగా కాకుండా, ఒక సినిమా విజయాన్ని సామాజిక బాధ్యతతో ఎలా అనుసంధానం చేయవచ్చో చూపించే ఉదాహరణగా నిలుస్తోంది.